# తారు మారు

రచన: ప్రకాశరావు

పాతికేళ్ళ పొగరుమోతు వయసులో ఈ లోకంలో అసాధ్యమైన విషయమంటూ ఏదీ కనిపించదు. ఏవో ఆశయాలూ ఆదర్శాలే తప్ప మరో ఆలోచన వుండదు. ఈ కళ్ళు లోకాన్ని కడిగేయాలనీ, ఈ సంఘాన్నుద్ధరించి పారేయాలనే భావనలే తప్ప నేలమీద నడుద్దామనే అయిడియా కూడా రాదు, కాని ఇలా గొప్ప గొప్ప కబుర్లు చెప్పిన శాల్తీలే ముప్పై దాటే సరికి అడ్రసు లేకుండా మారిపోతాయి. వేడి రక్తం చప్పగా చల్లారిపోతూంది – జలుబు నీళ్ళు కాస్తా వదిలి మామూలు మనుషుల్లో స్థిరపడి పోతారు. దీనికి ఎవరినీ తప్పు పట్టలేం—వయసు పైబడే సరికి, ఆలోచనలన్నీ ఎందుకు తారు మారౌతాయి? దీనికి పరిస్థితులూ, చుట్టూ వున్న మనుషుల దోహదం ఎంతవరకు? అంటే ఇదమిద్ధమని జవాబు చెప్పడం కూడా కష్టం.

తండ్రి ఇంకో రెండు ఘంటల్దాకా ఇంటివేపురారని రూఢిగా తెలిసిం తరవాత వాళ్ళమ్మతో శాంతియుత వాగ్వాదానికి దిగాడు రఘు. దాదాపు పాతికేళ్ళు పైబడ్డా తండ్రి అంటే ఇంకా బెదురు పోలేదు, లెక్చరరు పుద్యోగం చేస్తూ బోల్డు డబ్బు సంపాదిస్తున్నా రఘుకు. 'ఏరా?' అనీ తండ్రి అంటే నత్తి, కొద్దిగా వణుకూ ముచ్చెమటలూ ఇప్పటికీ పుట్టుకొస్తాయి. కాలేజీలో ప్రొఫెసర్‌తో ఎన్ని సార్లు దెబ్బలాటేసుకుని రిహార్సల్స్ వేసుకున్నా నాన్న దగ్గరెందుకలా అవుతూందో రఘుకు అంతుబట్టదు.

" అమ్మా! నాకా శర్మగారి సంబంధం ఏం నచ్చలేదు. మీ వాలకం చూస్తే ఎగిరి గంతేసి ఒప్పుకునేలా పున్నారు. మీరెన్ని చెప్పినా సరేనే ససేమిరా వినను....''

కామాక్షమ్మగారికిదేం అంతుబట్టలేదు. నిక్షేపంలాటి సంబంధం. శర్మగారికి బోలెడాస్తి, పెద్ద అంబాసిడర్ కారూ, మూడంతస్థుల మేడా, ఒక్కగానొక్క కూతురూ పున్నారు. (లేక పున్నాయి.) ఆయన స్వయంగా కార్లో వచ్చి తిరిగి పోతే, వాళ్ళమ్మాయిని చూసి వచ్చిం తరవాత




కూడా వీడికిదేం మొండి వాదన! చిన్న వయసా, చితక వయసా ? గాలిగాని సోక లేదు కదా!

అసలు రఘు ఆలోచనలే వేరు. శర్మ గారి కూతురు బాగో లేదని కాదు. చక్కగా జబా యదురిలా వుంది-వాళ్ళ డ్రాయింగ్ రూం తెలుగు సినిమా సెట్టింగ్‌లా వుంది వాళ్ళ బొచ్చు కుక్క చాలా ఫ్రెండ్లీగా వుంది. ఇలా చాలా చాలా వున్నాయికాని, రఘుకు నచ్చనిది మరోటి కాలేజీలో అక్కడా వరకట్న దురాచారాన్ని ఖండిస్తూ చాలా లెక్చర్లు దంచి ప్రైజులు సంపాయించాడు. అంతటితో ఆగిపోతే బావుండి పోవును. తాను వరకట్న ప్రసక్తిలేకుండా ఒక బీదమ్మాయిని పెళ్ళి చేసుకుని యువ లోకానికే ఆదర్శప్రాయుడు కావాలనీ, కనీసం ఒక కుటుంబానికైనా ఈ పిశాచ బాధలనుండి విముక్తి కలిగంచాలనీ పుబలాటం పేరుకు పోయింది. శర్మగారమ్మాయిని చేసుకోవడం ఈ ఆదర్శాలకు భంగకరం—ఇలా అని అతని అంతరాత్మ మరీ మరీ పోరి చెప్పింది. కట్నం తీసుకున్నా కోకపోయినా—ఒకే కూతురు, బోలెడాస్థి—అబ్బే! ఇది ఆదర్శప్రాయం కానేరదు.

అందుకనే పక్కింటి కమలను ధామ్మని ప్రేమించేశాడు. ఆ సదరు కమలకు పొడుగాటి జడతో బాటు చీమిడి ముక్కు

తమ్ముడూ, ఇంజనీరింగ్ పాసై ఏడాదిగా గోళ్లు గిల్లుకుంటూ చెప్పులరగ దీసుకుంటూన్న అన్నా, కూతురు కనిపించినప్పుడెల్లా బట్టతల మీద మిగిలి పోయిన అ నాలుగు వెంట్రుకలూ పీక్కునే తండ్రీ వున్నారు. వాళ్ళింటో ఒక్క కమల తప్ప అంతా కష్టాల్లో మునిగి తేలుతున్నట్టు మొహం లేసుకు తిరుగుతారు. ఏమైనా సరే ఆ కమలనే పెళ్లి చేసుకోవాలని దృఢ నిశ్చయం చేసుకున్నాడు రఘు.

ఈ సంగతి తెలిసిం తరవాత ఏడు తాటిచెట్లెత్తు లేస్తారేమో నాన్న—అనుకున్న రఘు ఆయన జాము చెట్టెత్తేనా లేవకుండా పడక్కుర్చీలోనే కూర్చుని ప్రశాంతంగా మాట్లాడితే బోలెడాశ్చర్య పడిపోయాడు. ఆయన 'అవునా?' అని అడిగితే రెండుసార్లు గుటక మింగినా (వెధవది) 'అవును!' అని కరెక్ట్‌గా డైలాగు మరిచిపోకండా చెప్పాడు. ఇంకా చాలా చెబుదామనీ ఓ లెక్చరు దంచుదామనీ అనుకున్నాడు కాని మాట పెగిలి చావలేదు. ఆయనే ఓ పెద్ద లెక్చరు ఓపిగ్గా ఇచ్చారు. బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి రమ్మన్నారు. అదంతా తలెత్తకుండా విని తలూపి బయటకు వచ్చి తల్లి తో 'అబ్బే! నేనా కమలనే చేసుకుంటాను' అని తిరుగు లేకండా చెప్పేశాడు. ఆ తర్వాత నెల తిరక్కుండానే కమల మెళ్ళో పట్టిగ్గా మూడు ముళ్లూ గట్టిగా లాగి మరీ వేశాడు.

ఇది జరిగిన ఆర్నెల్లక్కాబోలు కమల ఏదో కొంపలంటుకున్నట్టు మొగుడు గదిలోకి పరుగెత్తు కొచ్చింది.

"మా అన్నయ్యకు ప్రతిమతో నిశ్చయమైందిట తెలుసా! పై నెల్లోనే పెళ్ళిట - ఆ వెంటనే అమెరికా వెళ్తాట. అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయిట...." హడావుడిగా చెప్పింది.

"నీకు తొందరెక్కువ అమ్మడూ! మీ అన్నయ్యకు స్కాలర్షిప్ ఎప్పుడు వచ్చింది? అసలు ఈ ప్రతిమ ఎవరు?" రఘు మధ్యలో అడ్డు తగిలాడు.

"అయ్యో రామా! స్కాలర్‌షిప్ కాదండీ ...మరేమో ప్రతిమ శర్మగారి కూతురు. మీకు తెలీదూ?"

ఆ తరవాత మొగుడు ఎందుకు తెల్లబోయాడో. ఆ వెంటనే ఎర్రబారిన మొహంతో ఎందుకు విసురుగా బయటకు నడిచాడో పాపం కమలకు అంతు బట్టలేదు! *

